

సమ్మెకు రేషన్ డీలర్లు సిద్ధం

రేషన్ డీలర్లు తమకు గౌరవ వేతనం ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో సమ్మెకు దిగుతున్నారు. ఈ మేరకు వచ్చే నెల నుంచి షాప్‌ల బంద్‌కు నిర్ణయం తీసుకున్నారు. - 8లో▸



ఆటోను ఢీ కొట్టిన లారీ..

వెంకటాపురం(కె) మండల పరిధిలోని యోగితానగర్‌లో ఆగి ఉన్న ఆటోను ఇసుక లారీ ఢీకొట్టడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35^0 /26^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఉదయం సాధారణంగా ఉండి, మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ఉక్కపోతగా ఉంటుంది. పలు చోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి



వర్ధన్నపేట: వర్షాలకు తడిసి మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనాలని రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చందర్‌రావు బృందం శుక్రవారం మండలంలోని డీసీ తండా, కట్ర్యాల, కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించింది. బృంద సభ్యులు రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు భారం రాములు, రైతు సంఘం నాయకులు నర్సయ్య, కార్తీక్, శరత్, కర్ణాకర్, మురళీకృష్ణ, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ‘ఏ’లో చేర్చాలి

చెన్నారావుపేట: ముదిరాజ్‌లను బీసీ(ఏ)లో చేర్చాలని మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని జల్లీ గ్రామంలో మెపా ఉగాది డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. బీసీ డీ నుంచి బీసీ(ఏ)లోకి ప్రభుత్వం చేర్చాలంటే ఐక్య ఉద్యమాలు చేపట్టాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు దొంతరబోయిన నాగేశ్ మాట్లాడుతూ.. ముదిరాజ్ విద్యార్థుల భవిష్యత్ కోసం మెపా అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు కాట కుమారస్వామి, మంద శంకర్, దొంతరబోయిన అశోక్, నాగమల్లు, నరేశ్, నర్సయ్య, శివ శంకర్, రాజా తదితరులున్నారు.

సేంద్రియ వ్యవసాయం చేయాలి



వర్ధన్నపేట: రైతులు సేంద్రియ వ్యవసాయం చేసి అధిక లాభాలు ఆర్జించాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం దమ్మన్నపేటలోని భారత్ గోశాల ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా లేగదూడలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మహేశ్ అగర్వాల్, రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. గోవులను పెంచడం ద్వారా గోమూత్రం, పేడ, పాలతో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయవచ్చన్నారు. అధిక దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. సేంద్రియ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. రసాయనాలతో భూసారం తగ్గి పర్యావరణం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో గోశాల ప్రతినిధులు యాకూబ్, రైతులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ వివాదం



మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు

గీసుకొండ: మండలంలోని ఊకల్ సొసైటీలో శుక్రవారం మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా ప్రొటోకాల్ వివాదం నెలకొంది. ఈకార్యమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, సొసైటీ చైర్మన్ వీరస్వామి, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు. కాగా.. ప్రొటోకాల్ నిబంధనలు ఉల్లంఘించి జెడ్పీటీసీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని, మహిళా ప్రజాప్రతినిధిని అయిన తనను అవమానించారని ఎంపీపీ భీమగాని సౌజన్య ఆరోపించారు. గతంలో సైతం తనకు పలుమార్లు ఇలాగే.. అవమానం జరిగిందని ఈవిషయాన్ని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తీరు మారలేదన్నారు. ప్రొటోకాల్ పాటించకపోవడంపై పలువురు డైరెక్టర్లు తమ ఆక్షేపణ వ్యక్తం చేశారు.

హనుమకొండ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి బదిలీ?

- వరంగల్ జిల్లా అధికారి శారదకు ఇన్‌చార్జ్ బాధ్యతలు

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి ఎం.సబిత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీడీగా పదోన్నతిపై బదిలీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా ఇన్‌చార్జ్ వరంగల్ జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి శారదకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. బదిలీపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

7 గంటలు

వరంగల్ నగరంలో సాగిన మంత్రి కేటీఆర్ పర్యటన

- కిట్స్ కాలేజీలో ఇన్నోవేషన్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభం
- రూ.181.45 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- బహిరంగ సభలో నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం
- షెడ్యూల్ కంటే ఆలస్యంగా కార్యక్రమాలు

బహిరంగ సభలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, చీఫ్‌విప్ వినయ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు



సాక్షి ప్రతినిధి వరంగల్/హసన్‌పర్తి/హన్మకొండ చౌరస్తా/కాజీపేట/కరీమాబాద్ : రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ నగర పర్యటన శుక్రవారం మధ్యాహ్నం 2.40 నుంచి రాత్రి 9.45 గంటల వరకు అంటే 7 గంటల పాటు సాగింది. అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, బహిరంగ సభతో బిజీబిజీగా గడిపారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించి, వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. కాజీపేట సెయింట్ గాబ్రియల్ గ్రౌండ్స్‌లో బహిరంగసభలో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

మధ్యాహ్నం 2.40 - 5.40 :



ఎగ్జిబిట్ల గురించి తెలుసుకుంటున్న కేటీఆర్

హసన్‌పర్తిలోని కిట్స్ కాలేజీకి హెలికాప్టర్‌లో చేరుకున్న కేటీఆర్ మొదట ఇన్నోవేషన్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభించారు. అనంతరం కాలేజీలో ఎగ్జిబిట్లను సందర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశమై ప్రసంగించారు. అదేవిధంగా ఇటీవల నిర్వహించిన కేసీఆర్ కప్ క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన హనుమకొండకు బయలుదేరారు.

సాయంత్రం 6.00-6.15 :



వినయ్‌భాస్కర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న కేటీఆర్

హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. ముందుగా సమావేశమందిరంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను కుర్చీలో కూర్చోబెట్టి బాధ్యతలు అప్పగించారు.

సాయంత్రం 6.20-7.20 :



సైన్స్‌పార్క్‌లోని పరికరాలను పరిశీలిస్తున్న కేటీఆర్

హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాల ఆవరణలో.. హనుమకొండలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. మొత్తం 24 అభివృద్ధి పనులు కాగా రూ.181.45 కోట్లతో చేపట్టనున్నారు. చివరగా హెచ్‌ఆర్‌హెచ్ నెక్స్, జెన్‌పాక్ట్, హెక్సాడ్, ఎల్‌టీఐ మిండేట్రీ నాలుగు ఐటీ కంపెనీలను ప్రారంభించారు. సైన్స్ పార్కులో పరికరాలను చూశారు. పిల్లలతో సరదాగా మాట్లాడారు. వారితో ఫొటోలు దిగారు. గుడిసెవాసులకు ఇంటిస్థలాల పట్టాలు అందజేశారు.

7.40 - 8.20 :

కాజీపేట ఫాతిమాలోని సెయింట్ గాబ్రియల్ స్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి 7.40కి చేరుకున్నారు. 8.12 గంటలకు ప్రసంగం ముగించారు. తన ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూనే ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. వ్యంగ్యాస్త్రాలతో కార్యకర్తలను ఉత్తేజపరిచే ప్రయత్నం చేశారు. 8.20 గంటలకు కాన్వాయ్‌లో రంగశాయిపేటకు బయలుదేరారు.

రాత్రి 8.42 - 8.48 :



వరంగల్ జిల్లా కార్యాలయానికి భూమి పూజ చేస్తున్న కేటీఆర్, నరేందర్

వరంగల్–ఖమ్మం రోడ్డులోని రంగశాయిపేట ఏరియాలో నిర్మించతలపెట్టిన బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన ఉత్కంఠంగా కొనసాగింది. భూమిపూజకు కేటీఆర్ వస్తాడా రాడా అనేది చివరి నిమిషం వరకు సందిగ్ధంగా కొనసాగింది. సాయంత్రం 5.30 గంటలకు జరగాల్సిన శంకుస్థాపన రాత్రి 8.42 గంటలకు జరిగింది. కేటీఆర్‌కు ముందుగా ఎమ్మెల్యే నరేందర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. 10 నిమిషాల్లోనే కేటీఆర్ భూమి పూజ చేసి కార్యక్రమాన్ని ముగించుకుని రాత్రి 8.48 గంటలకు హనుమకొండ బయలుదేరారు.

9.00 -9.15 :

రంగశాయిపేట నుంచి నేరుగా హనుమకొండలోని స్నేహనగర్‌లో గల రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న ఇంటికి వచ్చారు. పది నిమిషాలపాటు గడిపారు.

అడుగడుగునా పోలీస్ బందోబస్తు

మంత్రి కేటీఆర్ రాక సందర్భంగా పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశం మేరకు డీసీపీ ఎంఏ బారీ, ఏసీపీ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో బహిరంగ సభా స్థలి చుట్టూ సాయుధ పోలీసుల పహారా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకున్నారు. కాజీపేట సబ్ డివిజన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్లు సార్ల రాజు, ఒంటెరు రమేష్, వేణు, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఆలస్యంగా కేటీఆర్ పర్యటన..

కేటీఆర్ పర్యటన ఆలస్యంగా సాగింది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2.45 గంటలకు మొదలై సాయంత్రం 6.45 గంటల వరకు సాగాలని ఉంది. సమయం కంటే ఐదు నిమిషాల ముందే వచ్చినా.. రాత్రి 9.38 గంటల వరకు సాగింది. కిట్స్ కళాశాలలో షెడ్యూల్ కంటే ఎక్కువ సమయం పట్టడంతో ఆ తర్వాత కార్యక్రమాలు కూడా ఆలస్యమయ్యాయి. సెయింట్ గాబ్రియల్ గ్రౌండ్స్‌లో సభకు ముందు చేయాల్సిన నాయుడు పంపు సమీపంలో వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయం నిర్మాణా నికి శంకుస్థాపన, స్నేహనగర్ బీఆర్‌ఎస్ నేత ఇల్లు సందర్శన, గాంధీనగర్ వైకుంఠధామం ప్రారంభం.. సభ తర్వాత చేశారు.

రాత్రి 9.20-9.45 :



మోడల్ వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న కేటీఆర్

హనుమకొండ వాజ్‌పేయినగర్‌లో నిర్మించిన మోడల్ వైకుంఠధామానికి చేరుకున్నారు. వైకుంఠధామాన్ని ప్రారంభించారు. అనంతరం అంతా కలియతిరిగి గోడలపై చిత్రాలు, కల్పించిన సౌకర్యాలు, గ్రీనరీని పరిశీలించారు. కొత్త వైకుంఠధాన్ని ప్రారంభించారు. శ్మశానవాటిక చాలా బాగుందని అభినందించారు. అనంతరం కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన కలెక్టర్



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

వరంగల్ అర్బన్: రాష్ట్ర పురపాలక శాఖ, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం హనుమకొండ పర్యటనలో భాగంగా కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీకి హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రిని కలెక్టర్ ప్రావీణ్య కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సీడీఎంఏకు స్వాగతం పలికిన అధికారులు

కరీమాబాద్: హనుమకొండ పర్యటనలో భాగంగా శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌కు వచ్చిన రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణకు అధికారులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ ప్రావీణ్య పూల మొక్కను అందించారు. అడిషనల్ కలెక్టర్లు శ్రీవత్స కోట, అశ్విని తానాజీ వాకడే పుష్పగుచ్ఛాలు అందించారు.





సీడీఎంఏకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీవత్స కోట, అశ్విని తానాజీ వాకడే

పేర్లు వెల్లడించాలని నిరసన దీక్ష



నిరసన మహా దీక్షను ప్రారంభిస్తున్న ప్రణయ్‌దీప్

నర్సంపేట: దళితబంధులో అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లను సీఎం కేసీఆర్ ప్రకటించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రణయ్‌దీప్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కట్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదుట ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, డీపీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన, మహా రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితబంధును అవినీతి బంధు పథకంగా మార్చిన అధికార పార్టీ ఎమ్మెల్యేల వివరాలు వెల్లడించి కేసులు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడుతున్న ఎమ్మెల్యేల చిట్టా బయటపెట్టకపోతే సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా రాజకీయ యుద్ధం చేస్తామన్నారు. ఈఅంశంలో ప్రభుత్వం స్పందించికపోతే హైకోర్టు సుమోటో కేసుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బాబు రాజుయాదవ్, మాతంగి బాబు, దామర సుధాకర్, ఎండి.అక్బర్, శ్రీనివాసచారి, సాంబన్న, ఉప్పన్న, రవి, రాజు, శ్రీకాంత్, సరోజన, మమత, సుధారాణి, అనిత, శోభ, లక్ష్మి, కవిత, సునీత, మౌనిక, రజిత, రమాదేవి, ఎల్లమ్మ, స్వప్న, స్వర్ణలత పాల్గొన్నారు.

దేశానికి కమ్యూనిజమే ప్రత్యామ్నాయం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నర్సంపేట: పెట్టుబడిదారులు, మతోన్మాదులు ఏలుతున్న ఈదేశానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజం మాత్రమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. నర్సంపేటలో పంజాల చంద్రమౌళి ఆరో వర్ధంతిని శుక్రవారం మండల కార్యదర్శి గడ్డం యాకయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగం పెరిగిందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన బీజేపీ వాగ్దానం కాగితాలకే పరిమితమైందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమసమాజ స్థాపనే లక్ష్యంగా చంద్రమౌళి ఆశయ సాధనకు భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కేసీఆర్ కేవలం మాటలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట చంద్రకళ, నారపు రమేశ్, సీపీఐ జిల్లా నాయకులు మియాపురం గోవర్ధన్, పాలక కవిత, ల్యాదల శరత్, అయితే యాకయ్య, గడ్డం నాగరాజు, దేవపాల సాంబయ్య, మమతా, శైలజ, రవి, స్వామి, యాదగిరి పాల్గొన్నారు.

రైతన్నకు కోలుకోలేని దెబ్బ

- వర్షాలకు తడిసిన మక్క, వరి ధాన్యం
- అమ్మబోతే ‘తేమ’ కొర్రీలు
- దరి చేరని మద్దతు ధర



మార్కెట్‌లో మక్కల నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)



మార్కెట్ ఆవరణలో ఆరబోసిన మక్కలు తడవడంతో కుప్ప చేస్తున్న రైతులు

నర్సంపేట: ఇటీవల కురిసిన వర్షాలకు మక్క, వరి ధాన్యం తడిసిపోగా.. తేమ పేరిట తక్కువ ధరతో కొనుగోళ్లు జరుగుతుండడం రైతన్నల్ని మరింత కుంగదీస్తోంది. మార్కెట్ యార్డుల్లో ఆరబోసుకుంటున్న రైతులకు అడపాదడపా కురుస్తున్న వర్షాలు జిల్లా రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఎక్కువగా నర్సంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులకు నష్టం కలిగించాయి. జిల్లాలో మార్చి 18న కురిసిన వడగళ్ల వర్షానికి మొక్కజొన్న, వరి, మిర్చి 60 వేల ఎకరాల్లో నష్టపోయింది. సీఎం కూడా జిల్లాలో పంట నష్టాన్ని పరిశీలించి ఎకరాకు రూ.10వేలు ఇస్తానని ప్రకటించారు. ఇందులో భాగంగా వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి తమ నివేదికలో జిల్లాలో 60వేల ఎకరాలు నష్టపోయినట్లు పంపారు. ఆతర్వాత ఏప్రిల్‌తో పాటు మే 3వ తేదీ వరకు కూడా వర్షాలు కురిశాయి. రైతుల పంటలు తడిశాయి. అమ్ముకునేందుకు ఆరబోసుకుంటే ఏసమయంలో వర్షం వస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సైతం నియోజకవర్గంలో కురిసిన వర్షానికి ఆరబోసిన వరిధాన్యం, మక్క తడిసింది.

జిల్లాలో రెండేళ్లుగా ఇదే పరిస్థితి..

వ్యవసాయ ఆధారిత జిల్లా వరంగల్‌లోని 13 మండలాల్లో రెండేళ్లుగా వడగళ్ల వానలు, అకాల వర్షాలు మిర్చి, వరి సాగు చేసిన రైతులకు తీవ్రంగా నష్టాన్ని మిగుల్చుతున్నాయి. పెట్టుబడులు కూడా రాని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పు చేసి సాగు చేసిన రైతులు దిగుబడి వచ్చి అమ్ముకునే సమయంలో నష్టాన్ని చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 88,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగవగా.. అందులో దాదాపు 30 శాతం పంట వర్షానికి తడిసి ముద్దయ్యింది.

మద్దతు ధర లేదు..

జిల్లాలో భారీగా నష్టపోయిన మక్క రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు 20 కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. కొన్ని చోట్ల ప్రారంభించినప్పటికీ పంటను సాగు చేసిన రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటేనే కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకునే అవకాశం ఉంది. కురుస్తున్న వర్షాలతో రైతులు మక్కలను మార్క్‌ఫెడ్ శాఖకు అమ్ముకోలేని పరిస్థితి. కాగా.. మద్దతు ధర క్వింటాకు రూ.1,962గా నిర్ణయించినప్పటికీ వరుస వర్షాలతో తేమ శాతం నిర్ణయించిన దానికంటే మించిపోయింది. జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, నాచినపల్లి, నల్లబెల్లి, చెన్నారావుపేట, మహేశ్వరం, నెక్కొండ, తోపనపల్లి, ఊకల్‌హవేలి, వంచనగిరి, మొగిలిచర్ల, వరంగల్, ఆరెపల్లి, కాపులకనపర్తి, సంగెం, పర్వతగిరి, ఏనుగల్, రాయపర్తి వ్యవసాయ మార్కెట్, ఇల్లందలో కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు చేసుకునే సమయం లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు చూపాలి



ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న సతీశ్‌నారాయణ

రాయపర్తి: రైతన్నలు కోతుల బెడదలేని ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు చూపి లాభాలు గడించాలని రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ జిల్లా మేనేజర్ సతీశ్ నారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన శాఖ ద్వారా వచ్చే ఆయిల్‌పామ్ సబ్సిడీలను వినియోగించుకోవాలన్నారు. ఇతర పంటలు సాగు చేసినప్పుడు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుందని ఆయిల్‌పామ్ సాగులో చీడపీడల బెడద ఉండదన్నారు. కొత్తగా వేసుకునే రైతులు మొక్కలపై 90 శాతం రాయితీని వినియోగించుకోవాలని కోరారు. కోతుల బెడద ఉండదని, దళారీ వ్యవస్థ ఉండదన్నారు. రెండేళ్లలో ఫ్యాక్టరీ పూర్తి చేసి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట డివిజన్ అగ్రికల్చర్ ఆఫీసర్ సుస్మిత, ఫీల్డ్ ఆఫీసర్ దేవరాజు, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

నర్సంపేట అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రజనికిషన్
- కౌన్సిల్ అత్యవసర సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గుంటి రజని

నర్సంపేట: నర్సంపేట పట్టణాభివృద్ధి కోసం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో ప్రత్యేక కృషి చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు రూ.5.75 కోట్ల స్పెషల్ గ్రాంట్ కింద వినియోగం, తైబజార్ టెండర్ పరిశీలన, శానిటేషన్ సిబ్బందికి వేతనాల పెంపు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న 192 మందికి 2023–24 ఏడాదికి వేతనాలు రూ.4కోట్ల 17లక్షల 58వేల 860 మున్సిపల్ సాధారణ పద్దు నుంచి చెల్లించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించి ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ రజనికిషన్ మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. నర్సంపేటలో అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, కమిషనర్ వెంకటస్వామి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళకు తీవ్ర గాయం



వరంగల్ (పర్వతగిరి): ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా శుక్రవారం సంగెం మండలం ఆశాలపల్లి గ్రామానికి చెందిన దొంగల చంద్రమ్మ కాలు మీది నుంచి బస్సు టైర్ పోయింది. ఈప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయమైంది. చంద్రమ్మ అన్నారంలోని యాకుబ్ బాబా దర్గాకు వచ్చింది. దర్శనం అనంతరం ఇంటికి వెళ్లే క్రమంలో.. వరంగల్ వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు ఆశాలపల్లికి వెళ్లదని కండక్టర్ చెప్పడంతో ఆమె దిగేందుకు యత్నించింది. ఈక్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును నడపడంతో ఆమె కాలు మీది నుంచి బస్సు పోయింది. దీంతో చంద్రమ్మ కాలికి తీవ్ర గాయమై రక్తస్రావమైంది. స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

గోదావరిలో వ్యక్తి గల్లంతు


రహమాన్ (ఫైల్)

వెంకటాపురం (కె): ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని అంకన్నగూడెం సమీపంలో గోదావరిలో ఈతకు వెళ్లి గల్లంతైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని వీరాభద్రారం గ్రామంలోని పెళ్లికి హైదరాబాద్ నుంచి నలుగురు యువకులు వచ్చారు. పెళ్లి ఇంటికి వెళ్లకుండా వీరాభద్రారం సమీపంలోని గోదావరిలోకి స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తున్న క్రమంలో ఈతకొడుతూ ఎండీ .రహమాన్ గల్లంతయ్యాడు. తోటి స్నేహితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఇద్దరు చిన్నారుల అదృశ్యం


అదృశ్యమైన చిన్నారులు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని గుండ్లకుంట కాలనీకి చెందిన గోపి–నాగమణి దంపతుల కుమారులు ప్రేమ్కుమార్ (10), వినోద్ (8) అదృశ్యం కాగా శుక్రవారం రాత్రి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయం 8 గంటల సమయంలో ఇద్దరు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవటంతో తల్లిదండ్రులు పిల్లల ఆచూకీ కోసం వెతికారు. రాత్రి పొద్దుపోయే వరకు కూడా ఎలాంటి సమాచారం లభించకపోవటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారి కోసం గాలింపు చేపట్టారు.

భర్త మృతి కేసులో భార్య అరెస్ట్

నెల్లికుదురు: అనుమానాస్పదస్థితిలో జనవరి 15న గుగులోతు వీరన్న మృతి చెందిన కేసులో మృతుడి భార్య గుగులోతు అనూషను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. శుక్రవారం ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సొల్లతండా శివారు శనిగకుంట తండాకు చెందిన వీరన్నను భార్య అనూష కొట్టి తిట్టడంతోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడని విచారణలో తేలిందన్నారు. నిందితురాలైన అనూషను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సమ్మెకు రేషన్‌డీలర్లు సిద్ధం

- ముందుగా నిరవధిక బంద్
- ఇచ్చే కమీషన్ అద్దెకు, కరెంట్ బిల్లులకు సరిపోవడం లేదని ఆవేదన
- సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళనలు



ర్యాలీ నిర్వహిస్తున్న రేషన్ డీలర్లు (ఫైల్)


మానుకోట పట్టణంలోని రేషన్‌షాపు

మహబూబాబాద్: పలు శాఖల్లో సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మెబాట పట్టడంతో ఆ శాఖల్లో పాలన అస్తవ్యస్తమవుతోంది. ప్రస్తుతం జేపీఎస్‌లు, వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగుతుండగా వీఆర్‌ఏలు తమకు పే స్కేల్, పదోన్నతులు పలు డిమాండ్‌లతో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో రేషన్ డీలర్లు వారికి గౌరవ వేతనం ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో సమ్మెకు రెడీ అవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1977 మంది డీలర్లు ఉన్నారు. గతంలో 9 రకాల సరుకుల పంపిణీ జరిగేది. ప్రస్తుతం కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. క్వింటాకు రూ.70 కమీషన్ మాత్రమే చెల్లిస్తున్నారు. అందులో హమాలీ దిగుమతి క్వింటాకు రూ.10 పోను కేవలం రూ. 60 మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక షాపుకు 80 క్వింటాళ్లు కేటాయిస్తే దాంతో కమీషన్ రూ.5600 వస్తే అందులో ఇంటిఅద్దె రూ.2500 పోను హమాలీ చార్జీలు రూ 800, డీలర్‌కు మిగిలేది రూ 2300. కాగా దానిలో కరెంట్ బిల్లులు ఇతరత్రా పోను నెలకు రెండు వేలు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు వంద రూపాయలు రావడం లేదని అంటున్నారు. ఉచిత బియ్యం మాత్రమే పంపిణీ జరుగుతుంది.

కొన్నేళ్లుగా ఆందోళనలు.....

కొన్నేళ్లుగా గౌరవ వేతనం ఇవ్వాలనే ప్రధానడిమాండ్‌తో రాస్తారోకో, ధర్నాలు, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు మంత్రులకు, ఉన్నతాధికారులకు వినతులను అందచేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆనాడు వారు ఆందోళన విరమించారు. రేషన్‌డీలర్ల సమస్యల సాధనకు ఇటీవలే రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం జేఏసీగా ఏర్పాటైంది.

సమస్యలతో సతమతం..

వచ్చే కమీషన్ సరిపోక అద్దె, కరెంట్ బిల్లులు ఇతరత్రా వాటితో నానా తంటాలు పడుతున్నారు. దానికి తోడు తూకంలో తేడా ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్నారు. కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేసినా ప్రభుత్వం స్పందించలేదని డీలర్లు వాపోతున్నారు.

సమ్మెకు సిద్ధం

డీలర్ల సమస్యల సాధనకై జేఏసీ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో, మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముందుగా జూన్ నెల నుంచి నిరవధిక షాపుల బంద్‌కు నిర్ణయం తీసుకున్నారు. జూన్ నుంచి సమ్మెకు వెళ్లడానికి సిద్ధమవుతున్నట్లు సంఘం నాయకులు చెబుతున్నారు.

పలు శాఖల సిబ్బంది సమ్మెతో పాటు రేషన్‌డీలర్ల సమ్మె కూడా ప్రారంభమైతే ప్రజాపంపిణీ వ్యవస్థలో చాలా ఇబ్బందులు తలెత్తుతాయి. డీలర్ల సమ్మె విషయంపై ప్రభుత్వం ముందే నిర్ణయం తీసుకుని సమస్యలను పరిష్కరిస్తుందా లేదా అనే విషయం వేచిచూడాల్సిందే .

ప్రధాన డిమాండ్లు ఇవే ....

- గౌరవ వేతనం ఇవ్వాలి
- బియ్యం దిగుమతి హమాలీ చార్జి ప్రభుత్వమే భరించాలి.
- విద్యావంతులకు వారి శాఖాపరమైన సేవలో నియామకం చేయాలి
- ప్రతి డీలర్‌కు హెల్త్‌కార్డు ఇవ్వాలి
- బియ్యంతో పాటు ఇతరత్రా సరుకుల పంపిణీ చేయాలి.
- షాపులను మినీ సూపర్‌మార్కెట్లుగా మార్చాలి
- పట్టణాల్లో రూ. 60 వేలు గ్రామీణ ప్రాంతాలోని డీలర్లకు రూ.45 వేలు ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో సన్నద్ధమవుతున్నారు.

జిల్లాల వారీగా రేషన్‌డీలర్లు

హనుమకొండ	79
వరంగల్	509
జనగామ	335
జేఎస్ భూపాలపల్లి	277
ములుగు	224
మహబూబాబాద్	553

ముందే స్పందించాలి



రేషన్‌డీలర్ల మస్యలపై ప్రభుత్వం ముందే స్పందించాలి. లేకుంటే జూన్ నెల నుంచి సమ్మె బాట పడుతాం. భవిష్యత్ కార్యాచరణ విషయంపై జిల్లా వారీగా సంఘం జాక్ ఆధ్వర్యంలో సభలు సమావేశాలు జరుగుతున్నాయి. ముందుగా నిరవధిక బంద్‌కు నిర్ణయం తీసుకున్నాం.

- కుంభం యాదగిరి, సంఘం జిల్లా అధ్యక్షుడు

కమీషన్ సరిపోక ఇబ్బందులు పడుతున్నాం

కొన్నేళ్లుగా సమస్యలపై ఆందోళనలు చేస్తున్నాం. వచ్చే కమీషన్ సరిపోక ఆర్థిక ఇబ్బందులతో నానా తంటాలు పడుతున్నాం. కేవలం ఉచిత బియ్యంతో పాటు పలు సరుకుల పంపిణీ చేయాలి.

- జి.రాంచందర్‌రావు, సంఘం మండల అధ్యక్షుడు

రామన్న చెయ్యి వదిలేది లేదు


బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట : నా గొంతులో ప్రాణమున్నంత వరకు మంత్రి రామన్న చెయ్యిని వదిలిపెట్టే ప్రసక్తేలేదని ప్రభుత్వ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ప్రమాణం చేశారు. హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట సెయింట్ గాబ్రియల్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం రాత్రి ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సమక్షంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎన్నో అవమానాలు, ఒడిదుడుకులను ఎదుర్కొన్నానన్నారు. తనను పిలిచి రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన తెలంగాణ జాతిపిత సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. తన ప్రజాప్రతినిధి జీవితంలో ఎమ్మెల్యేగా పనిచేసిన ఈ పదేళ్ల జీవితం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయించలేకపోయానని, సీఎం కేసీఆర్, మంత్రి రామన్నల సహకారంతో హైదరాబాద్ తర్వాత అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తున్న వరంగల్ పశ్చిమ ప్రాంతానికి వీలైనంత మేరకు నిధులను మంజూరు చేయిస్తున్నామన్నారు. బలగం లాంటి తన కార్యకర్తల సహకారంతో వారిచ్చిన స్ఫూర్తి, ధైర్యంతో ఎక్కడా రాజీపడకుండా అభివృద్ధి పనులను చేయిస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ సహకారంతో రూ.78 కోట్లతో ఫాతిమానగర్‌లో చేపట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణపు పనులు కొన్ని సాంకేతిక కారణాలతో ఆలస్యం అవుతుందని ప్రజలు గుర్తించాలని కోరారు. మంత్రి రామన్న సహకారంతో హనుమకొండ జిల్లాకు 4 అతిపెద్ద ఐటీ కంపెనీలు ప్రారంభమయ్యాయని, వీటిలో 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మతతత్వంతో ప్రజలను విభజించి పాలించాలని చూస్తున్న బీజేపీ నాయకులు ఉమ్మడి వరంగల్ జిల్లాకు సాధించిన నిధులు శూన్యమని, వరంగల్ భద్రకాళీ ఆలయం మాడ వీధుల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.ఆయా కార్యక్రమాల్లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర రైతుబంధు అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతు కవిత, మాజీ ఎంపీ వొడితెల కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి, సురభివాణిదేవి, బస్వరాజ్ సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, శంకర్ నాయక్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, వికలాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, సీపీ రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పనులు 24 : నిధులు రూ.181.45 కోట్లు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ స్కూల్ మైదానంలోనే మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మొత్తం 24 అభివృద్ధి పనులకు రూ.181.45 కోట్లతో చేపట్టనున్నారు.

- ఫారెస్టు ఆఫీసు జంక్షన్ నుంచి జులైవాడ ఆటో జంక్షన్ వరకు రూ.1.50 కోట్ల ఎఫ్‌డీఆర్ నిధులతో మాస్టర్‌ప్లాన్ రహదారి
- అలంకార్ జంక్షన్ నుంచి అమృత వై జంక్షన్ వరకు రూ.60 లక్షలతో సీసీ డ్రైయిన్ నిర్మాణం
- అలంకార్ జంక్షన్ నుంచి కాపువాడ ప్రధాన రహదారి వద్ద రూ.90 లక్షల నిధులతో బాక్సు కల్వర్టు నిర్మాణం
- జెమినీ టాకీసు జంక్షన్ నుంచి 12 వెంట్స్ జంక్షన్ వరకు రూ.1.90 కోట్ల సాధారణ నిధులతో 450 ఎంఎం డాయ హెచ్‌డీపీఈ పైప్‌లైన్ నిర్మాణం
- హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రూ.98 లక్షలతో రెజ్లింగ్, కబడ్డీ హాల్ నిర్మాణం
- పశ్చిమ నియోజకవర్గంలో స్మార్ట్ సిటీ నిధులు రూ.5 కోట్లతో క్రీడాసౌకర్యాల నిర్మాణం
- వరంగల్ పార్ట్ ఏ అండ్ ఫేజ్–1 బాలసముద్రం , పోతన వద్ద రూ.3.58 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో ఎంఈపీ పనులతో కూడిన రెండు ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణం
- బంధం చెరువు అభివృద్ధికి రూ.3.15 లక్షల స్మార్ట్ సిటీ నిధుల కేటాయింపు
- రూ.24 కోట్లతో పట్టణ ప్రగతి పనులు
- రిటైనింగ్ వాల్ నిర్మాణం ఉన్న నాలా పైన సమ్మయ్యనగర్ బ్రిడ్జి నుంచి ప్రెసిడెన్సీ స్కూల్ బ్రిడ్జి వరకు రూ.12.58 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో అండర్‌గ్రౌండ్ నాలా నిర్మాణం.
- భద్రకాళీ ఆలయం చుట్టూ మాడవీధుల నిర్మాణానికి కుడా, ఎస్‌డీఎఫ్‌కు చెందిన రూ.30 కోట్లు కేటాయింపు.
- డీఐజీ బంగ్లా నుంచి ప్రకాష్‌రెడ్డిపేట ఆటోస్టాండ్ వరకు రూ.1.20 లక్షల కుడా నిధులతో సీసీ రోడ్డు, డ్రైయిన్స్ నిర్మాణం
- కామన్ ఫెసిలిటీ సెంటర్ బ్లాక్ 1, 2 నిర్మాణం ఎస్సీ, ఎస్టీసెల్ కోసం టీఎస్ కాస్ట్ నుంచి రూ.8.50 కోట్లు
- రూ. 5.86 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- వరంగల్ సెంట్రల్ లైబ్రరీలో రూ.90 లక్షల స్మార్ట్‌సిటీ నిధులతో స్మార్ట్ లైబ్రరీ సిస్టమ్ అమలు
- వరంగల్ ప్రాంతీయ గ్రంథాలయంలో స్మార్ట్ సిటీ నిధులు రూ.1.10 లక్షలతో స్మార్ట్ లైబ్రరీ సిస్టమ్ అమలు
- రూ.5 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో జక్కలొద్దిలో క్రీడా సౌకర్యాల నిర్మాణం
- కీర్తినగర్‌లో రూ.5 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో క్రీడా సౌకర్యాల నిర్మాణం (పరకాల)
- రూ.2 కోట్లతో హసన్‌పర్తిలో ఆధునిక ధోబీఘాట్ అభివృద్ధి
- రూ.2 కోట్ల సాధారణ నిధులతో హసన్‌పర్తిలో వైకుంఠధామం అభివృద్ధి
- కాజీపేట, శాయంపేటలో రూ.5 కోట్లతో షాదిఖానా నిర్మాణం


సైన్స్ పార్కు ప్రారంభం అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కేటీఆర్ గ్రూప్ ఫొటో


ఎంఓయూ పత్రాలు అందజేస్తున్న కేటీఆర్


పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న కేటీఆర్

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

శాయంపేట : పంటసాగుకు అప్పు తెచ్చి పెట్టినా పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి, కూతురు పెళ్లికి లక్ష రూపాయల అప్పులు కావడంతో వాటిని ఎలా తీర్చాలని మదనపడుతూ రైతు వైద్యుల మల్లారెడ్డి (45) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని పత్తిపాకకు చెంది న రైతు మల్లారెడ్డి తన కున్న ఎకరం భూమితోపాటు మరో నాలుగెకరాలు భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. వరి, మొక్కజొన్న పంట సాగు చేయగా పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాలు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. అప్పులు కావడంతో ఎలా తీర్చాలని తీవ్ర మనోవేదనకు గురై ఈనెల 3న వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు సేవించగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు.గమనించిన తోటి రైతులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరివేసుకొని విద్యార్థి ..


ప్రణయ్ (ఫైల్)

నర్సంపేట రూరల్ : ఉరివేసుకొని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్టుపల్లి మండలంలోని వెల్లుళ్ల గ్రామానికి చెందిన జోగ ప్రణయ్ (21) వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ఫైనలియర్ చదువుతున్నాడు. ప్రణయ్ గత నెల క్రితమే హాస్టల్ నుంచి బయటకు వచ్చి నర్సంపేటలో రూం అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం తన స్నేహితులతో కలిసి కళాశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి రూంకు వచ్చాడు. అయితే ప్రణయ్ ఉండే పైఅంతస్తులో తన స్నేహితులు ఉండడంతో తన స్నేహితుల వద్ద నుంచి సెల్‌ఫోన్ తీసుకొని తన రూంకు వచ్చాడు. ఆ సెల్‌ఫోన్ కోసం ప్రణయ్ వద్దకు స్నేహితులు వచ్చి తలుపుకొట్టారు. ఎంతకూ తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపు తీసి చూసేసరికి ఉరివేసుకొని కనిపించారు. వెంటనే పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలుపడంతో వెంటనే పోస్టుమార్టంకు తరలించారు. ఈ సంఘటనపై ఎస్సై రవీందర్‌ను వివరణ కోరగా ప్రణయ్ మృతి చెందిన సంఘటన వాస్తవమేనన్నారు. కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడతామని ఎస్సై పేర్కొన్నారు.

రైలు ఎక్కుతుండగా జారిపడి..

- తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు

కాజీపేట: ప్రయాణికులతో బాగా రద్దీగా ఉన్న రైలు ఎక్కడానికి ప్రయత్నించి పట్టు తప్పి కిందపడడంతో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడిన ఘటన కాజీపేట రైల్వే జంక్షన్‌లో శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన తిప్పాటి ఫారుల్ (28) భార్య, పిల్లలతో కలిసి ఖమ్మం వెళ్లడానికి కాజీపేటలో హౌరా ఎక్స్‌ప్రెస్ ఎక్కడానికి ప్రయత్నించాడు. ప్రయాణికులతో పూర్తిగా నిండి ఉండడంతో 4 ఏళ్ల కుమారుడిని చంకలో ఎత్తుకుని రైలుమెట్లపై కాలు పెట్టగా ఎవరూ లోపలికి రావడానికి అవకాశం ఇవ్వలేదు. సహచర ప్రయాణికులు సహకరించకపోవడంతో పట్టుతప్పి ప్లాట్‌ఫాంపై పడిపోయాడు. వెంటనే ప్రయాణికులు ఫారుల్‌తో పాటు సాయితేజను కాపాడారు. డ్యూటీలో ఉన్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ 108కు ఫోన్ చేయగా బాధితులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బాధితుడు బోగీలో రద్దీగా ఉండడంతో ఏసీ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కడానికి ప్రయత్నించగా టీసీ సహకరించలేదని బాధిత కుటుంబం కన్నీళ్లు పెట్టుకుంది.

ఆటోను ఢీ కొట్టిన లారీ..

- పలువురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన కృష్ణారావు, చింత హరికృష్ణ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని యోగితా నగర్ గ్రామ సమీపంలో ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన ఇసుకలారీ ఏడుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఏటూరునాగారం నుంచి వెంకటాపురం ఆటోలో ఏడుగురు ప్రయాణికులు వస్తున్నట్లు తెలిపారు. యోగితా నగర్ సమీపంలో ఆటోలో ఉన్న ప్రయాణికులను దింపేందుకు డ్రైవర్ రోడ్డుపక్కకు ఆటోను ఆపి ప్రయాణికులను దింపుతున్నాడని తెలిపారు. ఇదే సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని ఇసుక ర్యాంప్ నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టింది. ఆటో పల్టీకొట్టడంతో పాటు ప్రయాణికులకు గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు 108 కు సమాచారం ఇవ్వగా గాయాలైన వారిని వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. బోదాపురం గ్రామానికి చెందిన కారం కృష్ణారావు, పాత్రాపురం గ్రామానికి చెందిన తాటి రజితకు, జగన్నాథపురం గ్రామానికి చింత హరికృష్ణకు, అకుల ఉమామహేశ్వరావుకు తీవ్రగాయాలయ్యాయి. మిగతా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంకటాపురం వైద్యశాలలో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్య కోసం వరంగల్ తరలించినట్లు తెలిపారు.

కుక్కలను చంపిన వ్యక్తులపై కేసు

ఖానాపురం : మండల కేంద్రంలో ఏప్రిల్ 6న 50 కుక్కలను గుర్తుతెలియని వ్యక్తులు ఇంజక్షన్, పాయిజన్‌తో హతమార్చారు. దీంతో గ్రామానికి చెందిన పలువురు ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎన్‌జీఓకు ఫిర్యాదు చేశారు. వారితో పాటు పశువైద్యాధికారులు కూడా విచారణ చేపట్టి కుక్కలను హతమార్చిన విషయం వాస్తవమేనని గుర్తించారు. కుక్కలను హతమార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్‌జీఓ బాధ్యులు అదులాపురం గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

జనగామ రూరల్ : ఓ వ్యక్తి దహన సంస్కారానికి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు వ్యక్తి బావిలో పడి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని పెద్దపహాడ్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పురుమ యాదగిరి (45) దహన సంస్కారం ముగించుకొని ఇంటికి వస్తుండగా ఆకస్మాత్తుగా బావిలో పడగా తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి, భార్య సిద్ధమ్మ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఈత కొడుతూ ఫిట్స్‌తో బాలుడు..


సాయి(ఫైల్)

పాలకుర్తి టౌన్: మండలంలోని విస్నూరుకు చెందిన కైతోజు సాయి(17) బావిలో ఈత కొట్టేందుకు వెళ్లి ఫిట్స్‌తో మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని సార బావిలో స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లాడు. బావిలో ఈత కొడుతుండగా ఫిట్స్ రావడంతో బావిలో మునిగిపోయాడు. దీంతో బావిలో మునిగిన సాయి ఇంకా రావడం లేదని అనుమానం వచ్చిన స్నేహితులు వెంటనే వారి ఇళ్లకు వెళ్లి విషయం చెప్పారు. గ్రామస్తులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. బావి వద్దకు చేరుకున్న తహసీల్దార్ పాల్‌సింగ్, అగ్నిమాపక అధికారి దయాకర్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది గంట పాటు మృతదేహాన్ని వెతికిబయటికి తీశారు. సీపీఆర్ విధానాన్ని చేసినప్పటికీ బాలుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు.